క్లుప్తంగా

కేఎంసీ ఏఎంసీగా షఫీఉల్లాహ్



షఫీఉల్లాహ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా మధిర నుంచి బదిలీపై వచ్చిన అహ్మద్ షఫీఉల్లాహ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో పారిశుద్ధ్య పనుల చేయించడం తన మొదటి ప్రాధాన్యత అని, దానితో పాటు కార్యాలయ పరిపాలన సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ఈమేరకు షఫీఉల్లాహ్‌కు పలువురు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్‌సీలు తక్షణమే విడుదల చేయాలని రఘునాథపాలెం మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరావు, తూమాటి సైదుబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఎంఈఓ రాములుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే డీఏలు ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ బాధ్యులు బాలయ్య, తిరుపతిరావు, సతీష్, సోమల నాయక్, జబ్బార్, రంగారావు, రేపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'గంగవరపు' స్ఫూర్తితో ముందుకు సాగాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంరూరల్: పేద ప్రజల పక్షపాతి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు గంగవరపు విజయ్‌కుమార్ స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంవెంకటాయపాలెంలో జరిగిన గంగవరపు వర్ధంతిలో ఆయన పాల్గొని నివాళులర్పించి మాట్లాడారు. కమ్యూనిస్టుల త్యాగాలు, పోరాట పటిమతోనే సాధ్యమైన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను గత ప్రభుత్వాలు చెరిపేయాలని చేశాయని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండడం కమ్యూనిస్టులకు దక్కిన గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎండీ.మౌలానా, జిల్లా నాయకులు మిడకంటి చినవెంకటరెడ్డి, పుచ్చకాయల కమలాకర్, యడ్లపల్లి శంకరయ్య, పగిళ్ల వీరభద్రం, వెంకటేశ్వర్లు, వెంపటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర
వినోద	జనక అయితే గనక
సాయిరాం	విశ్వం, స్వాగ్
ఆదిత్య	జోకర్, దక్షిణ, రాంనగర్ బన్ని
శ్రీనివాస	వెట్టియన్:ద హంటర్
సినీ గెలాక్సీ	మా నాన్న సూపర్ హీరో

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	60	బచ్చలికూర	3
వంకాయ	34		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	44		20
కాకర	44	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	48	తోటకూర	3
దొండ	28		20
పొట్లకాయ	60	గోంగూర	5
చిక్కుడు	90		20
గోరుచిక్కుడు	54	మెంతికూర	2
క్యాబేజీ	34		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	34		50
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	64		25
క్యాప్సికం	88	-ఖమ్మం వ్యవసాయం	

పాతుకుపోయిన పెత్తనం..!

కేఎంసీలో వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఇష్టారాజ్యం

- ఏళ్ల తరబడి ఉంటూ అంతా తామై..
- డీఈలు మారినా పాత వారి వద్దే విధులు
- వర్క్ ఇన్‌స్పెక్టర్లకూ అసిస్టెంట్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కీలక విభాగమైన ఇంజనీరింగ్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ల పెత్తనం పెరిగిపోయిందన్న విమర్శలు ఉన్నాయి. అటు క్షేత్రస్థాయిలో, ఇటు కార్యాలయంలో కొంత మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఏళ్లతరబడిగా ఇంజనీరింగ్ విభాగంలోని కీలకమైన డ్రాయింగ్ బ్రాంచిలో పాతుకపోయి చక్రం తిప్పుతున్నారు. టెండర్ల ప్రక్రియ నుంచి పనులు పూర్తయిన తర్వాత బిల్లుల పాస్ ఆర్డర్ ఇచ్చే వరకు ఈ విభాగంలోని అధికారులదే పూర్తి బాధ్యత. అయితే ఈ విభాగంలో పాతుకుపోయిన కొంతమంది సిబ్బంది అంతా తామై చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అసిస్టెంట్ ఇంజనీర్‌ల కింద పని చేసే వర్క్ ఇన్‌స్పెక్టర్లు తామే అధికారులమన్న చందంగా వారి కింద సహాయకులుగా కొంత మంది సిబ్బందిని నియమించుకుని రాజ్యమేలుతున్నారు. అసలే కేఎంసీలో సిబ్బంది కొరత ఉండగా.. తాగునీటి సరఫరాకు చెందిన పంపు ఆపరేటర్లను వీరు తమ కింద పెట్టుకొని పనులు చేయిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

విద్యార్హత లేకున్నా..

ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న వర్క్ ఇన్‌స్పెక్టర్లలో ఎక్కువ శాతం ఐటీఐ సర్టిఫికెట్లు కలిగిన వారే ఉన్నారు. డిప్లొమా, ఇంజనీరింగ్ చదివిన వారు ఈ హోదాలో పని చేయించాల్సి ఉన్నా.. అధికారులు రాజకీయ పలుకుబడి ఉన్న వారిని ఔట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకున్నారు. వీరికి కనీస విద్యార్హత కూడా లేదనే విమర్శలు ఉన్నాయి. కొంత మంది ఏకంగా దొంగ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగం పొందారన్న ఆరోపణలు ఉన్నాయి.

కదలని సిబ్బంది..

ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే వర్క్ ఇన్‌స్పెక్టర్లను మూడేళ్లకు ఒకసారి డివిజన్లను మార్చి మరో డీఈఈకి కేటాయిస్తుంటారు. నెల రోజుల క్రితం వర్క్ఇన్‌స్పెక్టర్లను కమిషనర్ డివిజన్లు మార్చుతూ ఆదేశాలు ఇచ్చారు. అయినా వారు మాత్రం పాత డీఈఈలు, పాత డివిజన్లలోనే పాతుకుపోయి అక్కడ నుంచి కదలడం లేదని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇక డ్రాయింగ్ బ్రాంచ్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఏళ్ల తరబడిగా పని చేస్తూ ఇటీవల జరిగిన మార్పుల్లో తమ పేర్లు లేకుండా చూసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక వీరు రెగ్యులర్ ఉద్యోగులను సైతం మాటలతో ఇబ్బందులు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రెగ్యులర్ ఉద్యోగులను కాదని వీరినే డీబీలో కొనసాగించడంపై కూడా పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో సిమెంట్‌తో చేసే పనులను పరిశీలించాల్సిన వీరికి సరైన అవగాహన లేకపోవడంతో నాణ్యత లేకుండా రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నా పనులను అడ్డుకోలేని పరిస్థితి ఉంది. దీంతో అనేక రోడ్లు నాణ్యత లేకుండానే నిర్మించినట్లు తెలుస్తోంది. ఇక ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఏకంగా రెగ్యులర్ సిబ్బంది, అధికారులపై కూడా పెత్తనం చలయిస్తున్నారన్న చర్చ కేఎంసీలో జరుగుతోంది.

అధికారుల అండతో..

ఇంజనీరింగ్ విభాగంలో డివిజనల్ ఇంజనీర్ల కింద అసిస్టెంట్ ఇంజనీర్లు, వారి కింద వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తారు. అయితే వీరు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ, నాణ్యతను పరిశీలించాల్సి ఉంది. ఇటీవల కాలంలో అధికారుల అండతో కేఎంసీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా ఉన్న పంపు ఆపరేటర్లను, ఇన్‌వార్డ్‌లో పని చేసే వారిని తీసుకెళ్లి వారి కింద నియమించుకున్నారని, పని ప్రదేశాల్లో వర్క్ ఇన్‌స్పెక్టర్లకు కనిపించిన దాఖలాలు లేవన్న చర్చ కేఎంసీలో జరుగుతోంది. ఫలితంగా నగరంలో పైపుల లీకేజీలు, మంచినీటి సరఫరాలో సమస్యలు అధికంగా ఉంటే అక్కడ పని చేసే వారిని అసిస్టెంట్లుగా నియమించుకోవడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం..



ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే ఇంజనీరింగ్ విభాగంలో వర్క్ఇన్‌స్పెక్టర్లను పూర్తి స్థాయిలో డివిజన్లను మార్చుతాం. పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

పారిశుద్ధ్యంపై అడిషనల్ కలెక్టర్ అసంతృప్తి



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

నేలకొండపల్లి: స్థానిక మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యంపై అదనపు కలెక్టర్ పి.శ్రీజ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత రెండు రోజుల క్రితం నేలకొండపల్లి పర్యటనకు వచ్చిన సందర్భంగా నేలకొండపల్లిలో నెలకొన్న అపరిశుభ్రతపై సంబంధిత అధికారులపై సీరియస్ అయ్యారు. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే.. గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందని అధికారులను ప్రశ్నించారు. దీంతో శుక్రవారం ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) టి.రాంబాబు హుటాహుటినా నేలకొండపల్లికి వచ్చి పంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్య పనుల చేయించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెత్తను ఎప్పటికప్పుడు తొలిగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు శంకుస్థాపన

ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షాలు, మున్నేరు వరదలతో 48వ డివిజన్‌లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టేందుకు మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య శంకుస్థాపన చేశారు. శుక్రవారం డివిజన్‌లో కొబ్బరికాయ కొట్టి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వరదలతో దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలకు మరమ్మతులు చేయిస్తున్నట్లు చెప్పారు. పనులను నాణ్యతతో పాటు సకాలంలో పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోట గోవిందమ్మ, ఈఈ కృష్ణాలాల్, డీఈ మాధవి, ఏఈ కుమారస్వామి, మాజీ కార్పొరేటర్ తోట రామారావు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభించిన మేయర్, కమిషనర్

పారిశుద్ధ్యం, అభివృద్ధి పనుల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 59వ, 60వ డివిజన్లలో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. శుక్రవారం డివిజన్లలో పర్యటిస్తూ పనుల నిర్వహణను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా డివిజన్లలో నిర్మాణం పూర్తయిన రోడ్ల నాణ్యతను పరిశీలించి కొలతల ప్రకారం రోడ్డు వేశారా లేదా అని మట్టిని తీపించి చూశారు. ఈ కార్యక్రమంలో డీఈ ధరణికుమార్, ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమలకు సబ్సిడీలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఈ నెల 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు పాటిబండ్ల యుగంధర్, కమర్తపు గోపాలరావులు తెలిపారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రెండేళ్ల పాటు కొనసాగనున్న నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఎస్ఆర్ గార్డెన్స్‌లో సాయంత్రం 6గంటలకు జరగనుందని, రాష్ట్ర మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొంటారని చెప్పారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రానైట్ పరిశ్రమలకు సబ్సిడీలు అందించాయని, 40శాతం సబ్సిడీలు అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, నూతనంగా ఎన్నికైన కోశాధికారి మారం రెడ్డి పరమేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, తమ్మినేని సాగర్, కార్యనిర్వాహక సభ్యుడు దొండేటి స్వేదన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం అమలు దుర్మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రంలో నూతన విద్యా విధానం అమలు చేస్తామని నూతన విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి ప్రకటించడం దుర్మార్గమని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గసభ్యుడు ఇటికాల రామకృష్ణ ఖండించారు. శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ అజెండా అమలుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ విద్యావిధానాన్ని వెంటనే ఉపసంహరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శివనాయక్, వంశీ, రాకేష్ ప్రతాప్, సునిల్ రోహిత్, నరేష్, గోపి, సాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఖండించారు. తెలంగాణలో ఈ విధానాన్ని అమలు చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శరవేగంగా మద్దులపల్లి మార్కెట్ పనులు

ఖమ్మంరూరల్: మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేసి వచ్చే ఏడాది జనవరి కల్లా రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు అన్నారు. శుక్రవారం మార్కెట్ ఆవరణలో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మార్కెట్ నిర్మాణం పూర్తయితే ఖమ్మంరూరల్ మండలంతో పాటు తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా ఇక్కడే అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరినాథ్‌బాబు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



తిరుమలాయపాలెం: బచ్చోడు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

- తిరుమలాయపాలెం: మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో నాబార్డు సంస్థ పని చేస్తుందని సాయి స్వచ్ఛంద సంస్థ సీఈఓ వెంకన్న అన్నారు. శుక్రవారం మండలంలోని బచ్చోడు గ్రామంలో మహిళల కోసం నాబార్డు సహకారంతో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీతో పాటు ఇతర టెక్నాలజీతో ఆర్థికంగా ఎదగడం కోసం గ్రామాన్ని ఎంపిక చేసి విడతల వారీగా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించి మాట్లాడారు. 20రోజుల శిక్షణ కాలంలో రోజుకు రూ.50 చొప్పున గౌరవ వేతనంతో పాటు ఉచితంగా మెటీరియల్, కంప్యూటర్లు, ఇతర సామగ్రిని నాబార్డు అందిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బచ్చోడు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మాజీ చైర్మన్ తిమ్మిడి హనుమంతరావు, సీఈఓలు శిరీష, సైదులు, ట్రైనింగ్ మాస్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.
- నేలకొండపల్లి: మహిళలు స్వశక్తితో ఆర్థిక స్వావలంబన సాధించాలని మహిళ సంఘాల ప్రతినిధి మలసాని శకుంతల అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నూతక్కి గంగాధర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి కే.వీ.రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ ఏటుకూరి రామారావు, మహిళ సంఘం నాయకులు కొంగర ప్రభావతి, ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు బలుసు ప్రమీలా, ముందుల స్రవంతి, ఎడవల్లి సైదమ్మ, మున్నంగి లక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు పొలడుగు పూర్ణచందర్‌ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

పైనంపల్లిలో ఉద్రిక్తత..

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో ఇళ్లను కూల్చుతున్నారని స్థానికులు ఆందోళనకు దిగారు. కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మండలంలోని పైనంపల్లి వద్ద ఇంకా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాగా, శుక్రవారం సంబంధిత అధికారులు ఇళ్లు, ప్రహరీలను కూల్చేస్తుండడంతో బాధితులు ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారి అధికారులు నిబంధనల మేరకు కొనుగోలు చేసిన స్థలం కంటే ఎక్కువగా జేసీబీలతో కూల్చేస్తున్నారని బాధితులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా.. స్థానిక పోలీసులు రంగ ప్రవేశం చేసి చర్చించారు. ఇంకా తమకు డబ్బులు ఇవ్వనేలేదని, కూల్చివేతలు నిలిపివేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

'హార్వెస్ట్' విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఇండియన్ ఎస్‌జీఓ అవార్డు కౌన్సిల్ ఆధ్వర్యాన ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి వెబ్ డిజైనింగ్ అండ్ కోడింగ్ పోటీల్లో తమ విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించిందని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. శుక్రవారం కళాశాల ప్లస్ వన్ విద్యార్థిని జి.షణ్ముఖప్రియను అభినందించి మాట్లాడారు. ఈ నెల 10వ తేదీన ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటి నేషనల్ టాలెంట్ అవార్డు 2024ను తమ విద్యార్థిని సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈమేరకు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ సైతం షణ్ముఖప్రియ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు.

పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కామేపల్లి: పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలె శ్రీనుయాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మద్దుపల్లి గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకంలో భాగంగా అందించే ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను పారదర్శకంగా చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ పార్టీ చేయొద్దని, అర్హులలైన పేదలందరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు.

విశ్రాంత పోలీస్ అధికారులకు ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని స్తంభాద్రి ఆస్పత్రిలో విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యాన విశ్రాంత పోలీస్ అధికారులకు గుండె, నాడీ వ్యవస్థల వైద్య నిపుణులు డాక్టర్ పేర్లహర్షతేజ, గట్టినేని సురేష్‌లు ఉచిత హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణమూర్తి, రుద్రవెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విలీన సభ కరపత్రాల ఆవిష్కరణ



ఖమ్మంమామిళ్లగూడెం: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం/కామేపల్లి: దేశంలో బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణం కోసమే ఐఎఫ్‌టీయూను టీయూసీఐలో విలీనం చేస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఆవుల అశోక్ అన్నారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో జరిగే విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ సంబంధిత కరపత్రాలను శుక్రవారం ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, రఘునాథపాలెం కేజీబీవీ తదితర చోట్ల జరిగిన కార్మికుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరుణకుమారి, కోటిలింగం, విజయకుమారి, జ్యోతి, శిరీష, రేణుక, చంద్రకళ, కళావతి, మల్లేశ్వరి, నవ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కామేపల్లిలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యాన సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ ఉపాధ్యక్షుడు సక్రు, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ రాకేశ్, ఏఐకేఎంఎస్ ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు గుగులోత్ తేజనాయక్, సంపత్, సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రఘునాథపాలెం: మండలంలోని కేవీ బంజర గ్రామంలో వ్యవసాయ శాఖ రైతు శిక్షణ కేంద్రం ఖమ్మం, గ్రాంట్ తార్నన్ పీఐ ఫౌండేషన్ ఆధ్వర్యాన నేరుగా వెదజల్లే పద్ధతిలో వరి సాగుపై రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి ఇంటూరి భాస్కరరావు మాట్లాడుతూ.. ఈ కరివేద పద్ధతి ద్వారా వరి సాగు చేయడం వల్ల రైతు ఎకరాకు సుమారు రూ.10వేల పెట్టుబడి తగ్గుతుందని, సుమారు పది రోజులు ముందే పంట కోతకు వస్తుందన్నారు. పెంట్యాల వెంకటేశ్వర్లు సాగుచేసిన వరి క్షేత్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ కర్నాటి ఉమా మహేశ్వర్ రెడ్డి, ఫౌండేషన్ బాధ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిధులు ఇప్పించండి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం వరద బాధితులకు బీజేపీ మొసలికన్నీళ్లు కాదు కేంద్రం నుంచి నిధులు ఇప్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టులో వచ్చిన వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు, కేంద్ర ప్రభుత్వ అధికార బృందాలు పర్యటన చేశారు కాని ఇంతవరకు పైసా సాయం చేయలేదని మండిపడ్డారు. బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్‌కు ఖమ్మం జిల్లా ప్రజలపై సానుభూతి ఉంటే కుటుంబానికి రూ.3 లక్షలు కనీస సాయం అందించి, మాది కపట ప్రేమకాదని నిరూపించుకోవాలని నున్నా సవాల్ విసిరారు. బీజేపీ బాధిత కుటుంబాలకు సాయం చేయడంలో కూడా కుటిల రాజకీయాలకు పాల్పడుతుందని ఆయన విమర్శించారు.

పాత చప్టానే ప్రయాణమార్గం..



చప్టాపై వెళ్తున్న వాహనాలు

మున్నేరు వరదలతో ప్రకాశ్‌నగర్ వద్ద వంతెన వరదలకు దెబ్బతినడంతో ద్విచక్రవాహనాలు మినహా ఇతర వాహనాలన్నింటిని ఆ బ్రిడ్జిపై రాకపోకలు సాగించకుండా నిలిపివేశారు. దీంతో ఆటోలు, కార్లు, చిన్నచిన్న ట్రాలీలు నగరంలోకి రావాలన్నా.. రూరల్ మండలం కోదాడ వైపు వెళ్లాలన్నా చుట్టూ తిరిగి రావాల్సి వస్తుంది. దీంతో దాదాపు 10ఏళ్ల క్రితం నాటి ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు పాత చప్టాను ఆధునీకరించి వినియోగంలోకి తీసుకొచ్చారు. వ్యవసాయ మార్కెట్‌కు పత్తి సీజన్ ప్రారంభం కావడం, త్వరలో మిర్చి సీజన్ కూడా వస్తుండడంతో శుక్రవారం నుంచి ఈ చప్టాపై కార్లు, ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. రూ.వందల కోట్లు పెట్టి కట్టిన బ్రిడ్జి నిరుపయోగంగా మారగా.. పాత చప్టానే ప్రయాణానికి మార్గం అయిందని వాహనదారులు పేర్కొంటున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్/ఖమ్మంక్రైం